క్లుప్తంగా

ఎస్ఐని కలిసిన వైఎస్సార్ సీపీ నాయకులు



ఎస్సైతో వైఎస్సార్ సీపీ నేతలు

దొనకొండ: స్థానిక పోలీసుస్టేషన్‌కు నూతన ఎస్ఐగా నియమితులైన టి.త్యాగరాజును వైఎస్సార్ సీపీ మండల మాజీ కన్వీనర్ కాకర్ల కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన్ను శాలువాలు, బొకేలతో సన్మానించారు. ఎస్సైని కలిసిన వారిలో వైఎస్సార్ సీపీ నాయకులు నూనె వెంకటరెడ్డి, బత్తుల వెంకట సుబ్బయ్య యాదవ్, కాలూరి రమణయ్య, పాతకోట కోటిరెడ్డి, గొంగటి పోలిరెడ్డి, డి.ఇస్మాయిల్, కర్నాటి ఆంజనేయరెడ్డి, కసిబిసి నాగరాజు, ప్రసాద్, పిక్కిలి అంకయ్య, వల్లపునేని వీరాచారి, విప్పర్ల సుబ్బయ్య, ఏడుకొండలు, ఐలూరి శ్రీనివాసరెడ్డి, నాగేశ్వరరెడ్డి, ఎగ్గోని కృష్ణారెడ్డి, వై.నాగేశ్వరరావు ఉన్నారు.

చెంచు గిరిజనులకు ఆధార్ క్యాంప్



ఆధార్ క్యాంప్‌లో పాల్గొన్న చెంచు గిరిజనులు

పెద్దదోర్నాల: మండల పరిధిలోని చిలకచర్ల, బందంబావి, మోట్ల మల్లికార్జునపురాల్లో ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి వెంకటశివ ప్రసాద్ ఆదేశాలతో శుక్రవారం ఆధార్ క్యాంప్ నిర్వహించారు. శుక్రవారం జరిగిన క్యాంప్‌లో ఏపీఐఓ మధుసూదన్‌రావు, ఆదర్శ సంస్థ కోఆర్డినేటర్ కరుణాకర్‌ల ఆధ్వర్యంలో ఆధార్ లేని పలువురు గిరిజనులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆధార్ క్యాంప్‌లో 26 రకాల ఆధార్ అప్డేట్‌లతో పాటు మరో 5 కొత్త ఆధార్ సర్వీస్‌లను ఉచితంగా అందజేశారు. ఆదర్శ సంస్థ ఫీల్డ్ స్టాఫ్ శామ్యూల్, కోటేశ్వరరావు, దావీద్, వెంకటేశం, సుబ్బయ్య పాల్గొన్నారు.

రాయడం, చదవడం నేర్పించాలి



విద్యార్థుల సామర్థ్యాలు పరిశీలిస్తున్న ఎంఈవో ఇందిర

పుల్లలచెరువు: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు ముఖ్యంగా రాయడం, చదవడం నేర్పించాలని ఎంఈవో ఇందిర అన్నారు. శుక్రవారం మండలంలోని కొమరోలు పాఠశాలను ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలోని రికార్డులను తనిఖీ చేసి విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. అమె మాట్లాడుతూ ప్రతి విద్యార్థికి తప్పని సరిగా రాయడం, చదవడం నేర్పించాలన్నారు. విద్యార్థుల నోట్ పుస్తకాలు చెక్ చేయడంతో పాటు చదవించాలన్నారు. ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ చూపుతూ వారి అభ్యున్నతికి బాటలు వేయాలని కోరారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన భోజనం అందజేయాలని ఉపాధ్యాయులను ఎంఈఓ ఇందిర ఆదేశించారు.

అమ్మవారికి వెండి శంఖు సమర్పణ



అమ్మవారికి వెండి శంఖు అందజేస్తున్న గ్రంథిశిల సుబ్బారావు

త్రిపురాంతకం: త్రిపురాంతకేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా బాల త్రిపుర సుందరి దేవి అమ్మవారికి శుక్రవారం యర్రగొండపాలేనికి చెందిన గ్రంథిశిల వెంకట సుబ్బారావు రూ.1.40 లక్షల విలువ చేసే వెండి శంఖును అందజేశారు. ఆలయ చైర్మన్ ఇమ్మడిశెట్టి వెంకట సుబ్బారావు ఆధ్వర్యంలో అమ్మవారి ప్రధాన అర్చకుడు ప్రసాద్ స్వామి ఆ శంఖును అందుకున్నారు. దాత కుమారులు గ్రంథిశిల లోకేష్, నిఖేష్ గుప్త పాల్గొన్నారు.

మహిళ అదృశ్యం

ముండ్లమూరు (కురిచేడు): మహిళ అదృశ్యంపై స్థానిక పోలీసుస్టేషన్లో కేసు నమోదైనట్లు ఎస్‌హెచ్‌ఓ బి.వెంకటేశ్వర్లు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ముండ్లమూరు ఎస్సీ కాలనీకి చెందిన మహిళ ఈ నెల 14వ తేదీ రాత్రి ఇంట్లో అందరూ నిద్రిస్తున్న సమయంలో ఎటో వెళ్లిపోయింది. బంధువులు, స్నేహితుల వద్ద వెతికినా ఆచూకీ లభించక పోవడంతో స్థానిక పోలీసులకు ఆమె భర్త ఏసేశ్‌బాబు శుక్రవారం ఫిర్యాదు చేశాడు. అదే కాలనీకి చెందిన తాతపూడి దేవయ్య కూడా అదే రోజు నుంచి కనిపించడం లేదని, తన భార్య అదృశ్యానికి అతనే కారణమై ఉండొచ్చని ఆయన తన ఫిర్యాదులో పేర్కొన్నట్లు ఎస్‌హెచ్‌ఓ వెంకటేశ్వర్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన చెప్పారు.

గోపాల.. నైవేద్యం ఎలా?



ధూప దీపారాధనకు నోచుకోని వేణుగోపాలస్వామి

- భూస్వామికే బువ్వ కరువు
- పట్టించుకోని అధికారులు, ధర్మకర్తలు

కురిచేడు: మండలంలోని పడమర గంగవరంలో శ్రీవేణుగోపాలస్వామికి నైవేద్యం కూడా కరువైంది. ఆలనా పాలనా చూడాల్సిన దేవదాయశాఖ అధికారులు, ఆలయ ధర్మకర్తలు పట్టించుకోవడం లేదు. నిత్యం పూజలు జరగాల్సిన ఆలయంలో కనీసం వారానికి ఒకసారి కూడా పూజలకు నోచుకోవడం లేదు. నాటి పెద్దలు ముందుచూపుతో ధూపదీప నైవేద్యాల కింద సుమారు 54 ఎకరాల భూమిని ఆలయానికి కేటాయించారు. ఏటా ఆ భూమిని కౌలుకు ఇచ్చి లక్షలాది రూపాయలు స్వాహా చేస్తున్నారేగానీ ఆలయ అభివృద్ధికి ఖర్చు చేయడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. గతంలో పనిచేసిన దేవదాయశాఖ అధికారి ఒకరు 5 లక్షల రూపాయల వరకు స్వాహా చేసి వెళ్లారు. ఆయనపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకున్న వారు లేరని గ్రామస్తులు విచారం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం నియమితులైన అధికారి ఆలయం వైపు కన్నెత్తి కూడా చూడటం లేదని, వేలం పాటల సమయంలో వచ్చి పాటలు నిర్వహించి ఆ డబ్బులు వసూలు చేసుకుని వెళ్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. నైవేద్యం పెట్టక పోవడంతో పాటు ఆలయం లోపల గడ్డి మొలచి పిచ్చి చెట్లు దర్శనమిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 2024లో గ్రామస్తులు చందాలు వసూలు చేసి ఆలయాన్ని అభివృద్ధి చేసి నూతన విగ్రహ, ధ్వజ స్థంభ ప్రతిష్ట జరిపామని, దాని తర్వాత ధ్వజ స్తంభానికి తొడుపు మాత్రమే వేసి చేతులు దులుపుకున్నారని, కౌలు డబ్బు ఎంత వసూలైంది, దేనికి ఎంత ఖర్చు చేసింది గ్రామ పెద్దలకు చెప్పాల్సి ఉన్నా ఎవరికీ సమాధానం చెప్పడం లేదని గ్రామస్తులు పేర్కొంటున్నారు. ఆలయంలో పనిచేసే వారికి జీతాలు కూడా చెల్లించక పోవడంతో ఆలయ పూజారి ధూపదీప నైవేద్యాలు చెల్లించడం లేదని, పనివారు కూడా రావటం లేదన్నారు. ఆలయానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన బోరు మోటారు మరమ్మతులకు గురైనా పట్టించుకున్న నాథుడే కరువయ్యాడన్నారు. గతంలో ఇలానే వ్యవహరించడంతో ఆలయం శిథిలావస్థకు చేరిందని, అధికారుల నిర్వాకంతో తిరిగి అదే పరిస్థితి ఏర్పడే అవకాశం ఉందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. పడమర గంగవరం, రెడ్డెన్నపల్లి గ్రామాల మధ్య పొలంలో ఉన్న ఆలయానికి రక్షణ కూడా లేదని, దేవదాయ శాఖ అధికారులు వెంటనే వచ్చి ఆలయానికి కౌలు ద్వారా వచ్చిన ఆదాయ వ్యయాల లెక్కను గ్రామస్తులకు తెలియజేసి నిత్య ధూపదీపారాధన జరిగేలా చర్యలు తీసుకోవాలని, ఆలయ రక్షణ కోసం సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.



తాళం వేసి ఉన్న గర్భగుడి

మాతృభాష తల్లి వంటిది



మాట్లాడుతున్న ఎంఈవో ఆంజనేయులు



తెలుగుతల్లికి నివాళులర్పిస్తున్న టీచర్లు



వై.పాలెం: బహుమతులు అందజేస్తున్న ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ శ్రీనివాస్

పుల్లలచెరువు: మాతృభాష కన్నతల్లితో సమానమని స్థానిక కేజీబీవీ ప్రిన్సిపాల్ లిల్లీప్రకాశ్‌వాణి అన్నారు. శుక్రవారం కేజీబీవీ పాఠశాలలో అంతర్జాతీయ మాతృభాష దినోత్సవం ఘనంగా నిర్వహించారు. తెలుగు తల్లి, తెలుగు భాషాభివృద్ధికి కృషి చేసిన గురజాడ అప్పారావు చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఉపాధ్యాయులు మాట్లాడుతూ మాతృభాష దినోత్సవ ప్రాధాన్యతను వివరించారు. తెలుగు భాష తల్లిలాంటిదని, తెలుగు భాషను మించిన భాషలు లేవన్నారు. తెలుగు భాషకు గురజాడ అప్పారావు ఏనలేని కృషి చేశారని, ఆయన చేసిన సేవలను విద్యార్థులకు వివరించారు. అనంతరం విద్యార్థులు తెలుగుతల్లికి వందనం అంటూ నృత్య గీతాలాపన చేశారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యర్రగొండపాలెం: పుట్టుకతోనే తల్లి ఒడిలోనే కొంత భాష పరిజ్ఞానం కలిగి ఉంటారని, ఇతర భాషలు ఎన్ని నేర్చుకున్నా మాతృ భాషను ఎప్పటికీ మరచి పోకూడదని ఎంఈవోలు పి.ఆంజనేయులు, మల్లూ నాయక్ అన్నారు. ప్రపంచ మాతృ భాష దినోత్సవం సందర్భంగా శుక్రవారం మండలంలోని వై.కొత్తపల్లి ఎంపీయూపీ స్కూల్లో జరిగిన కార్యక్రమాల్లో వారు పాల్గొని మాట్లాడారు. మాతృ భాషలో ప్రావీణ్యం సాధిస్తే ఇతర భాషలు సులభంగా నేర్చుకోగలుగుతారని, పరాయి భాష కూడా నేటి జీవనానికి అవశ్యకమన్నారు. ముందుగా సరస్వతీ దేవి, గిడుగు రామ్మూర్తి పంతులు చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులు తెలుగు తల్లి, గిడుగు రామ్మూర్తి, ఎరుకలసాని, తెలుగింటి ఆడపడుచు వేషాధారణలు ధరించారు. వీరి సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. హెచ్ఎం పి.లాలాజ్యోతి, ఉపాధ్యాయులు నాగేశ్వరరావు నాయక్, బాబుల్ నాయక్, ఆత్మానంద ప్రభాకర్, జీవీవీ నారాయణ, శ్రీనివాస్, ఎం.శ్రీకాంత్, మూర్తి, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

మోడల్ డిగ్రీ కళాశాలలో..

మాతృ భాషను మరచిపోతే మనుగడకే ప్రమాదమని, విద్యార్థులు తెలుగు భాషతో పాటు ఇతర భాషలపై పట్టు సాధించాలని స్థానిక ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కేఎస్‌వీ శ్రీనివాస్ అన్నారు. అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. తెలుగు లెక్చరర్ డాక్టర్ డి.సుజాత పాల్గొన్నారు.

కామన్ సర్వీస్ సెంటర్ సందర్శన



సీఎస్‌సీ సెంటర్‌లో విద్యార్థులు

పెద్దదోర్నాల: వృత్తి విద్యా కోర్సుల్లో (ఐటీ, ఇన్ఫర్‌మేషన్ టెక్నాలజీ) భాగంగా మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఐనముక్కలలోని సీఎస్‌సీ సెంటర్‌ను శుక్రవారం సందర్శించారు. పారిశ్రామిక కేంద్రాల పరిశీలనలో భాగంగా సీఎస్‌సీ సెంటర్‌ను సందర్శించిన విద్యార్థులు సీఎస్‌సీ సెంటర్‌లోని విభాగాలు, డిజిటల్ లాకర్, ఆధార్ సర్వీస్ తదితర అంశాలు తెలుసుకున్నారు. ప్రతి విద్యార్థి కంప్యూటర్‌పై అవగాహన పెంచుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఐటీ ఒకేషనల్ ట్రైనర్ నాయబ్ రసూల్ మాట్లాడుతూ పుస్తకాల్లో ఉన్న విషయాలు తెలుసుకోవడంతో పాటు కళ్లారా చూసి తెలుసుకుంటే విద్యార్థులకు అవగాహన పెరుగుతుందన్నారు. ప్రధానోపాధ్యాయుడు నారాయణరెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ రామానాయక్ పాల్గొన్నారు.

రైతులకు ఆధార్ తరహాలో ప్రత్యేక గుర్తింపు సంఖ్య



తాళ్లూరు: రైతులతో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాసరావు



పెద్దారవీడు: ర్యాలీ చేస్తున్న తహసీల్దార్ శైలేంద్రకుమార్, ఏఓ

పెద్దారవీడు: భూమి ఉన్న అన్నదాతలకు ఆధార్ తరహాలో ప్రత్యేక విశిష్ట గుర్తింపు సంఖ్య కేంద్ర ప్రభుత్వం కేటాయించేందుకు చర్యలు చేపట్టిందని తహసీల్దార్ శైలేంద్రకుమార్ అన్నారు. స్థానికంగా విశిష్ట గుర్తింపు సంఖ్యపై శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ భవిష్యత్తులో వివిధ సంక్షేమ పథకాలు వర్తించేందుకు ఈ విశిష్ట సంఖ్య ప్రామాణికం కానుందన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఫార్మర్ యూనిక్ ఐడీ కార్యక్రమంలో ప్రతి రైతూ తమ వివరాలు నమోదు చేయించుకుని విశిష్ట గుర్తింపు సంఖ్య పొందాలన్నారు. వ్యవసాయాధికారి కె.బుజ్జిబాయి మాట్లాడుతూ గ్రామాల్లోని రైతులందరూ విశిష్ట సంఖ్య నమోదు చేయించుకోవాలని, ప్రయోజనాలపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలు పొందాలంటే విశిష్ట సంఖ్య ఎంతో అవసరమని, పొలం ఉన్న ప్రతి రైతు వివరాలు నమోదు చేయించుకోవాలని కోరారు. ఏడీఏ జ్యోతిప్రసాద్, సీఎస్ఎఫ్ సిబ్బంది, పోస్ట్ హార్వెస్ట్ టెక్నాలజీ సిబ్బంది, సచివాలయ వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

తాళ్లూరు: పీఎం కిసాన్ నిధులు విడుదల చేయనున్నట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించిందని, రైతులు ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి ఎస్.శ్రీనివాసరావు సూచించారు. మండలంలోని శివరాంపురం, తాళ్లూరు-1,2, విఠలాపురం రైతు సేవ కేంద్రాల పరిధిలో ఫార్మర్ రిజిస్ట్రేషన్ జరుగుతున్న విధానాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు. పీఎం కిసాన్‌కు అర్హులైన రైతులకు సత్వరమే రిజిస్ట్రేషన్ చేయాలని సూచించారు. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా 1,58,000 మందికిపైగా రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు తెలిపారు. వీఏఏలు ఎం.రాజశేఖర్‌రెడ్డి, నాగరాజు నాయక్, వెంకట్రావు, అశోక్ పాల్గొన్నారు.



ముండ్లమూరు: మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాసరావు

ముండ్లమూరు (కురిచేడు): జిల్లా వ్యవసాయాధికారి ఎస్.శ్రీనివాసరావు, ఏడీఏ బాలాజీనాయక్లు మండలంలోని పసుపుగల్లు, ముండ్లమూరు గ్రామాల్లో జరుగుతున్న రైతు విశిష్ట సంఖ్య నమోదు కార్యక్రమాన్ని శుక్రవారం రాత్రి పర్యవేక్షించారు. సిబ్బంది పనితీరును పరిశీలించారు. రైతులు సిబ్బందికి సహకరిస్తున్న తీరును గమనించారు. రైతులతో మాట్లాడి విశిష్ట సంఖ్యతో రైతులకు కలిగే ఉపయోగాలను జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాసరావు వివరించారు. తహసీల్దార్ లక్ష్మీనారాయణ, వ్యవసాయాధికారి, రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

రీసర్వేలో లోపాలు ఉండొద్దు



మ్యాప్‌ను పరిశీలిస్తున్న ఆర్‌డీఓ కేశవర్ధన్‌రెడ్డి

దొనకొండ: భూముల రీ సర్వేలో లోపాలు ఉండకుండా పకడ్బందీగా టీమ్ మెంబర్స్ రీ సర్వే చేపట్టాలని కనిగిరి ఆర్‌డీఓ జి.కేశవర్ధనరెడ్డి సూచించారు. దొనకొండ పంచాయతీ వీరవెంకటాపురం రెవెన్యూలో జరుగుతున్న రీసర్వేను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్‌డీఓ మాట్లాడుతూ రీసర్వే చేసే ముందు సంబంధిత రైతులకు నోటీసులు ఇచ్చి రీ సర్వే చేయించాలని తెలిపారు. సంబంధిత రైతు లేకుండా రీసర్వే చేయకూడదన్నారు. ఎలాంటి పొరపాట్లు లేకుండా రైతులతో సంపూర్ణంగా మాట్లాడి భూమి సర్వే చేసి హద్దులు చూపించాలన్నారు. కొద్దిమేర పొరపాట్లు జరిగితే పొలం గట్టులను పరిగణనలోకి తీసుకుని రీసర్వే చేయాలన్నారు. తొలుత భూమి మ్యాప్‌ను పరిశీలించి సంబంధిత తహసీల్దార్ బి.రమాదేవితో విషయాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట రీసర్వే డీటీ కేవీ నాగార్జునరెడ్డి, సర్వేయర్లు పాల్గొన్నారు.

అధికారులు గార్బేజి కలెక్షన్‌కు హాజరుకావాలి



చెత్త సంపద తయారీ కేంద్రాలను తనిఖీ చేస్తున్న డీపీఓ వెంకటనాయుడు

- డీపీఓ వెంకటనాయుడు

ముండ్లమూరు (కురిచేడు): అధికారులు గార్బేజి కలెక్షన్‌కు హాజరు కావాలని జిల్లా పంచాయతీ అధికారి వెంకట నాయుడు ఆదేశించారు. ముండ్లమూరు నుంచి వీడియో కాన్ఫరెన్సు ద్వారా జిల్లాలోని పంచాయతీ అధికారులతో ఆయన మాట్లాడారు. అనంతరం మండలంలోని పెద్ద ఉల్లగల్లు, కెల్లంపల్లి గ్రామ పంచాయతీల్లో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. కమిషనర్ ఆదేశాల మేరకు శని, ఆదివారాలు రెండు రోజులు ప్రతి ఉద్యోగి తప్పనిసరిగా వారి వారి గ్రామాల్లోని ఇంటింటినీ సందర్శించి గార్బేజి కలెక్షన్‌కు హాజరు కావాలన్నారు. జిల్లాలోని డివిజనల్ పంచాయతీ అధికారులు, విస్తరణాధికారులతో వీడియో కాన్ఫరెన్సు నిర్వహించి రెండు రోజులు చేయాల్సిన కార్యక్రమాల గురించి వివరించారు. చెత్త సేకరణలో ప్రతి ఉద్యోగి పాల్గొని గ్రామస్తులకు చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం, దాని నిర్వహణ గురించి తెలిపారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఇంటి పన్నులు, పన్నే తరాలు మార్చి 15లోగా నూరు శాతం వసూలు చేసేలా టార్గెట్ నియమించుకొని దాని ప్రకారం అన్ని గ్రామ పంచాయతీల్లో పన్నుల వసూలు వేగవంతం చేయాలని, వసూలు మొత్తాన్ని విధిగా గ్రామ పంచాయతీ ఖాతాకు జమ చేయాలని డీపీఓ ఆదేశించారు. క్లాప్ మిత్రల వేతనాలు ఇంకా ఎక్కడైనా బకాయిలు చెల్లించాల్సి ఉంటే వెంటనే వారికి చెల్లింపులు చేసేలా తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎంపీడీఓ జనార్దన్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

శ్రీశైలానికి స్వాముల పాదయాత్ర



శ్రీశైలానికి వెళ్తున్న శివస్వాములు

కురిచేడు: మండల శివదీక్ష చేసిన స్వాములు పాదయాత్రతో శ్రీశైలానికి బయల్దేరారు. సుదూర ప్రాంతాల నుంచి స్వాములు ఇరుముడితో పాదయాత్రగా బయల్దేరి వెళ్తున్నారు. స్వాములకు దాతలు దారి మధ్యలో ఆహార పానీయాలు, వైద్య సదుపాయాలు ఏర్పాటు చేశారు. శ్రీశైలానికి వివిధ గ్రామాల నుంచి భక్తులు పాదయాత్రగా వెళ్తున్నారు. శుక్రవారం సాయంత్రం దర్శి వైపు నుంచి స్వాములు శ్రీశైలానికి వెళ్తూ కనిపించారు.

పంటలకు సాగర్ నీరు అందించాలి



ఎస్‌ఎస్పీ డీఈ విజయలక్ష్మికి వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

త్రిపురాంతకం: నాగార్జున సాగర్ కాలువ కింద పండిస్తున్న పంటలకు నీరు అందే విధంగా చర్యలు తీసుకోవాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొండ్రు పిచ్చయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఎస్ఎస్పీ డీఈ విజయలక్ష్మికి ఆయన వినతి పత్రం అందచేశారు. మండలంలోని డీవీఎన్ కాలనీ, పాత ముడివేముల, కొత్త ముడివేముల, పాపన్నపాలెం గ్రామాలకు చెందిన రైతులు మొక్కజొన్న, మిరప, పొగాకు, మినుము పంటలను పండిస్తున్నారని, ప్రస్తుతం ఆ పంటలు పొట్ట దశలో ఉన్నాయని, సకాలంలో నీరు అందక రైతులు తీవ్ర నష్టానికి గురికావాల్సి వస్తోందని ఆయన వివరించారు. వెంటనే ముడివేముల మేజర్ వద్ద ప్రత్యేకంగా వర్క్ ఇన్‌స్పెక్టర్‌ను ఏర్పాటు చేసి పంటలకు నీరు అందించాలని కోరారు. ఆయన వెంట ఆ పార్టీ మండల మాజీ అధ్యక్షుడు నల్లబోతు వీరాంజ యాదవ్ ఉన్నారు.

చురుగ్గా హైవే రహదారి పనులు



సాగుతున్న హైవే నిర్మాణ పనులు

పుల్లలచెరువు: మండలంలోని మల్లాపాలెం నుంచి హైదరబాద్ వెళ్లే హైవే రహదారి పనులు చురుగ్గా సాగుతున్నాయి. మాచర్ల నుంచి యర్రగొండపాలెం మధ్య రహదారిలో అటవీ అనుమతులు రాకపోవడంతో 20.9 కిమీ మేరకు రహదారి నిర్మాణం పెండింగ్‌లో ఉంది. అటవీ అనుమతులు రావడంతో హైవే అథారటీ ఆదేశాల మేరకు కాంట్రాక్టర్ పనులు ప్రారంభించినట్లు ఏఈ వేణుగోపాల్ తెలిపారు. మల్లాపాలెం నుంచి వెల్దుర్తి మండలం శిరిగిపాడు మధ్య 20.9 కిమీలకు రూ.257 కోట్లు ఖర్చు చేయనున్నారు. ఈ రహదారిలో కల్వర్ట్‌లు, బ్రిడ్జిలు మొత్తం 40 వరకు నిర్మించాల్సి ఉందని, అధికారులు ఇచ్చిన ఆదేశాలపై రహదారి పనులు 18 నెలల్లో పూర్తి చేయనున్నట్లు ఏఈ తెలిపారు. రహదారి మొత్తం పూర్తయితే యర్రగొండపాలెం నుంచి 3.30 గంటల సమయంలో హైదరాబద్ వెళ్లవచ్చని ప్రయాణికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

హైవేలో వేప చెట్ల నరికివేత



మెషీన్‌తో కోసిన వేపచెట్టు

బేస్తవారిపేట: ఒంగోలు-నంద్యాల హైవే రోడ్డు వెంట ఉన్న వేప చెట్లను కొందరు వ్యక్తులు పట్టపగలే నరికి అక్రమంగా తరలించుకుపోతున్నారు. శుక్రవారం ఉదయం బేస్తవారిపేట మండలంలోని సలకలవీడు బస్టాండ్ సమీపంలో భారీ వేప చెట్లను మెషీన్‌తో ముక్కలుగా చేశారు. ఓ వైపు పర్యావరణాన్ని రక్షించాలంటే మొక్కలు పెంచాలని ఉపన్యాసలిచ్చే రెవెన్యూ అధికారులు, ఆర్‌అండ్‌బీ అధికారులు.. భారీ చెట్లను నరికేస్తున్నా పట్టించుకోకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.